సాక్షి
జనగామ

గురువారం । 26 । జూన్ । 2025



తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రూ.8 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. -8లో▸



రైతుల గోస అర్థం చేసుకోండి

భూమిపట్టాలు రద్దు చేయడంతో కేసముద్రం మండలంలోని నారాయణపురం రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. -8లో▸

గరిష్టం/కనిష్టం

$33^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి.

న్యూస్‌రీల్

సిద్ధేశ్వరుడికి లక్ష పుష్పార్చన



బచ్చన్నపేట : కొడవటూర్ స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో బుధవారం స్వామివారికి లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. అమావాస్య తిథి ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా అందరికీ మంచి జరగాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. ఆషాఢం ముగిసిన తర్వాత శ్రావణంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఈఓ చిందం వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, మహాశివుడు, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి. గంగం భానుప్రకాష్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. పంచ హారతులు, కుంభహారతి, నక్షత్ర హారతి, విశేష హారతులతో గర్భాలయం దేదీప్యమానంగా వెలుగొందింది. భక్తులు తిలకించి పులకించి పోయారు. కార్యక్రమంలో ఈఓ సల్వాది మోహన్‌బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతీ శనివారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు హైదరాబాద్ సౌభాగ్యపురికి చెందిన దాతలు అంచూరి హనుమంతరావు-గీత దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయానికి చేరుకున్న వారు ప్రత్యేక పూజల అనంతరం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈఓ లక్ష్మీప్రసన్నకు విరాళం అందజేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక




సంతోష



జశ్వంత్

రఘునాథపల్లి: జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్–2025(అండర్–19 బాలుర, బాలికల) పోటీలకు జిల్లా నుంచి యా.సంతోష, జశ్వంత్ ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి వై.కుమార్‌గౌడ్, గట్టయ్య, ఉప్పలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో ఈనెల 28 నుంచి ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి



కొడకండ్ల : వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలందించాలని డీఎంహెచ్ఓ మల్లికార్జున్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఓపీ, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల విషయమై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం లక్ష్మక్కపల్లి సబ్‌సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్ఓ.. ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యాధికారి హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

- వండ్లు, కూరగాయ తోటలకు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు
- ఉచితంగా కూరగాయల నారు
- పూల తోటలకు 40, నీటి గుంటలకు 75శాతం రాయితీ
- 2025–26 ఆర్థిక సంవత్సరం రూ.48.80 లక్షల బడ్జెట్



ఆయిల్‌పాం నర్సరీ



మల్చింగ్ పద్ధతిలో సాగు



ఆయిల్‌పాం పంట సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: జిల్లాలో వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాంతో పాటు పండ్లు, కూరగాయల తోటల పెంపకమే లక్ష్యంగా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ముందుకు వెళ్తోంది. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 3,500 ఎకరాల్లో అయిల్‌పాం సాగు లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. పండ్ల తోటల సాగు, సబ్సిడీపై నీటి కుంటల నిర్మాణం, యాంత్రీకరణ పనిముట్లు అందివ్వడానికి బడ్జెట్ కేటాయించారు.

పెరుగుతున్న ఆయిల్‌పాం సాగు

జిల్లాలో 2021 నుంచి 2025 మార్చి వరకు ఆయిల్‌పాం సాగు 6,963 ఎకరాల్లో చేయగా.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 3,500 ఎకరాలుగా టార్గెట్ పెట్టుకుంది. కాగా 2వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు గుర్తించగా, ఇప్పటి వరకు 98 ఎకరాలకు మొక్కలు పంపిణీ చేశారు. ఒక్కో మొక్కకు రూ.193 సబ్సిడీ ఇవ్వగా, రైతు రూ.20 భాగస్వామ్యంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఈసారి ఆయిల్‌పాం దిగుబడి 3వేల ఎకరాల్లో 18వేల టన్నులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు 29 మంది రైతులు 227 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించారు.

పండ్ల తోటల సాగుకు సబ్సిడీ

జిల్లాలో మామిడి, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, అరటి, డ్రాగన్, అవకాడో తదితర పండ్ల తోటలు 146.50 ఎకరాల్లో సాగు లక్ష్యంగా రూ.48.80లక్షల బడ్జెట్ కేటాయించారు. రెండు సంవత్సరాల పాటు రూ.32వేల నుంచి రూ.లక్ష వరకు రాయితీ ఇవ్వనున్నారు. 12.5 ఎకరాల్లో బంతి, చామంతి, మల్లె, లోకల్ గులాబీ యూనిట్ ధర రూ.20వేలు నిర్ణయించగా.. 40 శాతంతో రూ.8వేల సబ్సిడీ ఉంది. దుంప జాతిరకంలో 5.5 ఎకరాల్లో లిల్లీ, జర్బెర, గ్లాడియోలస్ రకానికి చెందిన పూలతోటలసాగుకు యూనిట్ ధర రూ.లక్ష కాగా.. ఇందులో రూ.40వేల రాయితీ లభిస్తుంది. అలాగే ఎకరా టమాటా, వంకాయ కూరగాయల తోటలకు రూ.8వేలు, పచ్చి మిర్చికి 6,400 మొక్కలు ఉచితంగా ఇవ్వనున్నారు. మొత్తంగా 85 ఎకరాల టార్గెట్‌తో రైతులను ప్రోత్సహిస్తున్నారు. అంటు కట్టిన కూరగాయల సాగు కు సంబంధించి 20 ఎకరాలు లక్ష్యం పెట్టుకు ని ఎకరాకు 2వేల వంగ మొక్కలు ఇస్తారు. ఇందుకు రైతు తన వాటాగా రూ.5వేలు డీడీ తీసి ఇవ్వాల్సి ఉంటుంది.

మామిడి తోటల పునరుద్ధరణ

జిల్లాలో 20 ఎకరాల్లో పాత మామిడి తోటల పునరుద్ధరణకు ఒక్కో యూనిట్ రూ.24వేల చొప్పున 40శాతం(రూ.9,600)తో రాయితీ ఇస్తున్నారు. అలాగే 6 యూనిట్ల నీటి గుంటల(ఫాంపాండ్స్) నిర్మాణానికి ఒక్కో యూనిట్ ధర రూ.1.50లక్షల చొప్పున నిర్ణయించి 75శాతం(రూ.75వేలు) సబ్సిడీ ఇస్తారు. మల్చింగ్ విధానంతో కూరగాయల సాగుకు 2.50 ఎకరాలకు యూనిట్(ఎకరాకు) రూ.1,600 ధరతో రూ.8వేల సబ్సిడీ ప్రకటించారు. మిర్చి ఎండ బెట్టేందుకు 70 కేజీల సామర్థ్యంతో 36 యూనిట్ల సోలార్ డ్రయ్యర్లను ఒక్కో యూనిట్‌కు రూ.2.50లక్షల ధర ఉంది. ఇందులో జనరల్ వారికి 40శాతంతో రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీలకు 55 శాతంతో రూ.1.37లక్షల సబ్సిడీ ఇస్తున్నారు. 8 నుంచి 11 హెచ్‌పీ పవర్ టిల్లర్లు 6 మంజూరు చేశారు. సన్న, చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం, పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీ ఉంది. 9 పవర్ టిల్లర్లు మంజూరుకాగా.. చిన్న, సన్న, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం, పెద్ద రైతులకు 40 శాతం రాయితీతో ఇస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 బ్రష్ కటర్లు మంజూరు కాగా, ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న, మహిళా రైతులకు 50శాతం, పెద్ద రైతులకు 40శాతం, 10 స్ప్రేయర్ పంపులకు గాను ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న, మహిళా రైతులకు 50శాతం, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

పండ్ల తోటల పెంపకం, సబ్సిడీ వివరాలు (2025-26 సంవత్సరం ఎకరాల్లో..)

పంట	లక్ష్యం	యూనిట్ ధర	రాయితీ(40శాతం)
మామిడి	65	రూ.80వేలు	రూ.32వేలు
నిమ్మ	7.50	రూ.80వేలు	రూ.32వేలు
జామ	10.00	రూ.80వేలు	రూ.32వేలు
సీతాఫలం	2.50	రూ.30వేలు	రూ.12వేలు
బొప్పాయి	20.00	రూ.30వేలు	రూ.12వేలు
డ్రాగన్	9.00	రూ.2.70లక్షలు	రూ.1.08లక్షలు
అరటి	25.00	రూ.70వేలు	రూ.28వేలు
అవకాడో	7.50	రూ.50వేలు	రూ.20వేలు

ఈ పంటల సాగుకు రెండు సంవత్సరాల పాటు రాయితీ ఇస్తారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తుతో పాటు మొక్కలు, ఎరువు, పురుగు మందుల బిల్లులు జత పరిచి హార్టికల్చర్ అధికారులకు అందజేయాలి.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి



జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరం 3,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 2వేల ఎకరాలు గుర్తించి 98 ఎకరాలకు మొక్కలు అందించాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులకు వివరిస్తున్నాం. తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తుతో పాటు భూమి పాస్‌బుక్కు నకలు, ఆధార్, బ్యాంకు ఖాతా బుక్కు, పాస్‌ఫొటో జత చేసి సంబంధిత ఉద్యానవన అధికారులకు అందించాలి. ఓసీ లేదా ఇతర రైతులకు 50శాతం, బీసీలకు 29శాతం, ఎస్సీ రైతులకు 15శాతం, ఎస్టీలకు 6 శాతంతో రిజర్వేషన్ల ఆధారంగా రాయితీపై మొక్కలు, తోటల సాగుకు సంబంధించి మంజూరు చేస్తాం. దరఖాస్తులు రాగానే కలెక్టర్‌కు పంపిస్తాం. అనంతరం సదరు అధికారి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత రాయితీకి ఆర్థిక పరమైన అనుమతులు పొందుతాం.

– బి.శ్రీధర్‌రావు,
జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరును తెలుసుకుంటున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్



శ్రీసోమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న సీపీ

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

పాలకుర్తిటౌన్/కొడకండ్ల/జఫర్‌గఢ్: పోలీస్‌స్టేషన్ వచ్చి బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం పాలకుర్తి, కొడకండ్ల, జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్లను సందర్శించిన ఆయన పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్ పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ వెస్ట్‌జోన్ వర్ధన్నపేట డివిజన్ పరిధి పోలీస్‌స్టేషన్ల అధికారుల పని తీరును పరిశీలించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు తీసుకొని సత్వరమే న్యాయం చేసేలా చర్యల తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక చర్యలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం మోపాలని హెచ్చరించారు. ఆయన వెంట జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐలు జానకీరామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్‌రెడ్డి, చింతరాజు, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న సీపీ.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగం నాగరాజు పాల్గొన్నారు.

మార్పు వచ్చింది..

- ప్రభుత్వ పాఠశాలలపై ఆరు అంశాలతో పీజీఐ సర్వే
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23 కన్నా 2023-24 మెరుగ్గా ఫలితాలు
- శుభ సూచికం అంటున్న విద్యావేత్తలు

సాక్షి, మహబూబాబాద్: జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలు మొదలైన ఆరు అంశాలపై నిర్వహించిన పెర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్(ఎఫ్‌జీఐ) నివేదిక మెరుగ్గా ఉంది. గత రెండు సంవత్సరాల కంటే.. గడిచిన విద్యాసంవత్సరంలో ఫలితాలు మెరుగ్గా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఆరు అంశాల్లో 74 సూచికలకు 600 మార్కులు కేటాయించారు. ప్రతీ పాఠశాల నుంచి యూడైస్‌లో పొందుపర్చిన అంశాలను పరిశీలించి, సేకరించిన వివరాల ప్రకారం జాతీయ స్థాయిలో జిల్లాల వారీగా మార్కులు కేటాయించారు.

ఆరు అంశాలుగా పరిశీలన..

ప్రభుత్వ పాఠశాల పనితీరుకు అద్దం పట్టే ప్రధాన అంశాలను పరిశీలించారు. ఇందులో ఆరు అంశాల్లో 74 సూచికలను పేర్కొని మార్కులు వేశారు. మొదటి అంశంగా.. అభ్యసన ఫలితాలు, సామర్థ్యాలు, సంబంధాలు, ఉపాధ్యాయుల లక్ష్యాలు, నైపుణ్యాలు, రెండో అంశం.. బోధన నిర్వహణ, పిల్లల ప్రతిస్పందన, మూడో అంశం .. మౌలిక సదుపాయాల కల్పన, సౌకర్యాలను పరిశీలించారు. అలాగే పాఠశాలల భద్రత, పిల్లల రక్షణ, డిజిటల్ లెర్నింగ్, నిధుల వినియోగం, హాజరు పర్యవేక్షణ, పాఠశాలల్లో నాయకత్వ లక్షణాలు మొదలైన విషయాలను పరిశీలించారు. మొదటి రెండు అంశాల్లో గతం కంటే మెరుగైన మార్కులు సాధించగా.. మౌలిక వసతుల కల్పన, డిజిటల్ లెర్నింగ్‌లో 2022–23 విద్యాసంవత్సరం కంటే 2023–24 విద్యా సంవత్సరంలో వెనకబడినట్లు తేలింది. అయితే 2024–25 విద్యాసంవత్సరంలో మాత్రం అన్ని అంశాల్లో మెరుగుపడ్డామని, ఇందుకు ఈ ఏడాది పదో తరగతిలో సాధించిన ఫలితాలే నిదర్శనమని విద్యాశాఖ అధికారులంటున్నారు.

గతం కన్నా మెరుగు..

ఆరు అంశాల్లో 2022–23 విద్యా సంవత్సరం కంటే 2023–24 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పడినట్లు స్పష్టమవుతోంది. ప్రధానంగా అభ్యసన ఫలితాలు, సమన్వయం, ఉపాధ్యాయుల పనితీరుపై మొత్తం 24 సూచికలకు 290 మార్కులు కేటాయించగా 2022–23 సంవత్సరంలో హనుమకొండ జిల్లా 109 మార్కులు సాధించింది. అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాకు 79 మార్కులు వచ్చాయి. అయితే 2023–24లో హనుమకొండ జిల్లాకు 122 మార్కులు రాగా మహబూబాబాద్‌కు 95 మార్కులొచ్చాయి. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై 12 సూచికల్లో 51 మార్కులకు 2022–23లో మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు 29 మార్కుల చొప్పున వచ్చాయి. అదే మరుసటి సంవత్సరం హనుమకొండకు 29 మార్కులు రాగా మహబూబాబాద్ జిల్లాకు 27 మార్కులు వచ్చాయి. పాఠశాలల్లో పిల్లల భద్రతపై 31 మార్కులకు జనగామ, హనుమకొండ, ములుగు జిల్లాలకు 10 మార్కులకు పైగా రాగా మిగిలిన జిల్లాల్లో తక్కువగా వచ్చాయి.

ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా ఆరు అంశాల్లో సాధించిన మార్కుల వివరాలు

జిల్లా	మొత్తం మార్కులు	2022-23	2023-24
వరంగల్	600	226	245
హనుమకొండ	600	250	275
మహబూబాబాద్	600	210	229
జనగామ	600	235	271
జేఎస్.భూపాలపల్లి	600	220	253
ములుగు	600	214	231

కేంద్రం ఒరగబెట్టిందేమీ లేదు..

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి పదేళ్లుగా ఒరగబెట్టిందేమి లేదు.. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చేతగాని చవట దద్దమ్మలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రూ.2.12కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆధునిక బిగ్ కవర్ షెడ్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలు, రైతులు, మహిళల పక్షపాతి అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని, రైతులకు ఉచిత కరెంటుతో పాటు ఒక ఆర్థిక సంవత్సరంలోనే 25 లక్షల మందికి రూ.20,600 కోట్ల పంటరుణాలు మాఫీ చేసిందని చెప్పారు. తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే బీజేపీ, ఇతర రాజకీయ పార్టీలు ఒక్కసారి ఆలోచించాలని హితవు పలికారు. మొదటి నుంచి బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ నేతలు వేల కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఎవరెన్ని చవకబారు విమర్శలు చేసినా పట్టించుకునే పనిలేదని, అభివృద్ధే తమ ఎజెండా అని అన్నారు. అనంతరం ఇందిరమ్మ మైనార్టీ మహిళా పథకం ద్వారా 13 మంది క్రిష్టియన్ మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు, వివిధ గ్రామాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, డీఎంఓ బి.నరేంద్ర, డీఈ ఎల్లేష్, మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, ఆర్‌డీఓ వెంకన్న, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

యువజన విభాగం కీలకంగా పనిచేయాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహం వద్ద శివచరణ్‌రెడ్డి తదితరులు

జనగామ రూరల్ : పార్టీ బలోపేతంలో యువజన విభాగం కీలకంగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కు ఆయనతోపాటు రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖలీద్ హమీద్ హాజరయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యాదవ్ ఆధ్వర్యాన వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్రాంతి, ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ కృష్ణన్, జనగామ, స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాల అధ్యక్షులు కర్క సంతోష్‌రెడ్డి, విజయ్, రాజేష్‌నాయక్, ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



జల సంరక్షణపై కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పాల్గొన్న అధికారులు

జనగామ రూరల్: జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. వివిధ శాఖల ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. 'జలశక్తి అభియాన్' కింద నేషనల్ వాటర్ అవార్డ్స్–2024 కోసం కేంద్రం నుంచి అధ్యయన కమిటీ సభ్యులు కేంద్ర భూగర్భ జల శాఖ సైంటిస్ట్ డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్, భూగర్భ జల కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ చరణ్ బుధవారం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ జిల్లాలో భూగర్భజల వనరుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అశ్వరావుపల్లి, చీటకోడూరు, స్టేషన్‌ఘనపూర్ రిజర్వాయర్ల సామర్థ్యం, సాగు, తాగు నీటి వినియోగం గురించి తెలియజేశారు. ఉద్యానవన పంటల సాగుకు నీటి సంరక్షణలో భాగంగా స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాల వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా.. చేపల పెంపకం వలన సుమారు 80వేల మంది మత్స్యకారులు లబ్ధి పొందుతున్నారని, చేపలను ఎగుమతి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ వసంత, నీటిపారుదల ఎస్ఈ సుధీర్, వ్యవసాయం, ఫిషరీస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాటికొండలో జలశక్తి బృందం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలోని వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన పనులను కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి కేంద్ర జలశక్తి బృందం బాధ్యులు బుధవారం పరిశీలించారు. ముందుగా తాటికొండ రైతువేదికలో మహిళా సంఘం సభ్యులతో సమావేశమై తాగునీటి సరఫరా గురించి తెలుసుకున్నారు. గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి ఇంటింటికీ నీరు ఇస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం గురించి అడగ్గా.. గతంలో దిగుబడి అంతంత మాత్రమే ఉండేదని, ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగి పంటల సాగు లాభసాటిగా ఉందన్నారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని కలెక్టర్ కేంద్ర బృందానికి వివరించారు. తాటికొండ అటవీ ప్రాంతంలో గుట్టల పైనుంచి పడుతున్న వర్షపునీరు భూమిలోకి ఇంకడానికి కందకాలను అంచలంచెలుగా నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావునాయక్, మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్, అదనపు డీఆర్‌డీఏ పీడీ చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

జనగామ రూరల్: విద్యార్థులకు పర్యావరణపై అవగాహన అవసరమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ తయారుచేసిన నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'హరిత్ ద వే ఆఫ్ లైఫ్' అనే థీమ్‌పై దేశవ్యాప్తంగా 1వ తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో నిర్వహించే ఈ పోటీకి జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుందని, ఎకో మిత్రమ్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. హిందీ, ఇంగ్లిష్ మరిన్ని భాషల్లో క్విజ్ ఉంటుందని, విద్యార్థులతోపాటు సామాన్య పౌరులు కూడా పాల్గొనవచ్చని వివరించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి వెంటనే ఇ–సర్టిఫికెట్ లభిస్తుందని విద్యా సంస్థలకూ ప్రత్యేక గుర్తింపు ఇస్తారని తెలిపారు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ అప్లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో అగ్రగామిగా నిలపాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ(ఎస్ఎస్‌జీ)–2025లో జిల్లాను అగ్రగామిగా నిలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎం, ఏపీఓ, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు బాగుండాలని చెప్పారు. గ్రామానికి 20 చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. డీపీఓ స్వరూప, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, కర్ణాకర్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

లింగాలఘణపురం: యువత సామాజిక రుగ్మతలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బాల్యవివాహాల నియంత్రణపై బుధవారం కుందారం ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన హెచ్‌ఎం రవిశంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, వరకట్న నిషేధం, మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ వలంటీర్ జితేందర్, రాజశేఖర్, పీఎస్ ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ప్రాణం తీసిన చింతచెట్టు

- తెగిపడిన విద్యుత్ తీగలు పట్టుకుని రాజమ్మ మృతి
- అదే తీగల్లో పడి నాలుగు పశువులూ మృత్యువాత



విద్యుదాఘాతంతో మృతిచెందిన రాజమ్మ, పక్కన పశువులు



రాజమ్మ(ఫైల్)

వాజేడు: పంట సాగు చేస్తున్న ప్పుడల్లా చింతచెట్టు నీడ పడి పంట మంచిగా రావడం లేదని, ఆ చెట్టును తొలగిస్తే పంట బాగుంటుందని భావించారు వృద్ధ దంపతులు. కానీ, ఆ చెట్టు రూపంలోనే దూసు కొచ్చిన మృత్యువు ఆ దంపతుల్లో భార్య ప్రాణం తీసింది. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం మోతుకులగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతుకులగూడెం గ్రామానికి చెందిన బండి నారాయణ, రాజమ్మ(65) దంపతులు ఆ గ్రామంనుంచి వచ్చి రేగులపాడులో కొడుకు, కోడలితో కలిసి ఉంటున్నారు. మోతుకులగూడెం గ్రామంలో ఉన్న ఇంటి స్థలాన్ని బాగు చేసి కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నారు. ఆ స్థలంలో ఒక పక్కన చింతచెట్టు ఉండడంతో సాగుకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఆలోచనతో దానిని కూలీలను పెట్టి నరికిస్తున్నారు. తెగిన కొమ్మలను తాడుకట్టి పక్కకు లాగడంతో కొమ్మ తెగి విద్యుత్ తీగల మీద పడ్డాయి. దీంతో తీగలు తెగి కిందపడ్డాయి. తీగలు పడిన వైపు ఉన్న రాజమ్మ.. అటువైపుగా వస్తున్న రామక్క అనే మరో మహిళతో మాట్లాడుతూ తెగిపడిన తీగలను పక్కకు వేయాలనే ఉద్దేశంతో వాటిని పట్టుకుంది. వ్యవసాయ పనుల కోసం ఏర్పాటు చేసిన త్రీఫేజ్ విద్యుత్ లైన్ కావడంతో రాజమ్మ పట్టుకున్న తీగ చేతిలో ఉండగానే అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే మేస్తున్న పశువులు నాలుగు తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి. వెంటనే అక్కడికి చేరుకున్న గ్రామస్తులు మిగతా పశువుల గుంపును దూరంగా పంపించి విద్యుత్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. భర్త నారాయణ విద్యుత్ తీగలు తెగిపడిన వైపు కాకుండా మరోవైపు ఉండడంతో అతనికి ఏమీ కాలేదు. కాగా, ఇన్ని రోజులు త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌కు సరఫరా లేకపోగా, వరి నార్లు పోసుకుంటామని కొందరు రైతులు కోరడంతో విద్యుత్ సరఫరా చేసినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన పోలీసులు వివరాలు సేకరించారు. విద్యుత్ తీగల బారిన పడి తల్లి మృతిచెందడంతో కొడుకు, కోడలు, కూతురు రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం..

ఖిలా వరంగల్: రైల్వే డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలిప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఓ మహిళను మోసం చేశారు. ఆమెకు మాయమాటలు చెప్పి రూ.3.50 లక్షలు వసూలు చేశారు. వరంగల్ విశ్వనాథ కాలనీకి చెందిన ఇంజమూరి భాగ్యలక్ష్మి మేనబావ ఆడెపు నరేందర్ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీప కాలనీలో నివాసం ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి ఇంటికి వచ్చిన నరేందర్ 'నీ కుమారుడు వంశీకృష్ణకు ఉద్యోగం పెట్టిస్తా. నాకు తెలిసిన ఒక వ్యక్తి నల్లగొండ బాబూరావు హైదరాబాద్‌లో ఉంటాడు. అతడి ద్వారా రైల్వేలో కాంట్రాక్టు ఉద్యోగం పెట్టిస్తా. ఒక వేళ ఉద్యోగం రాకపోతే మూడు నెలల్లో డబ్బులు తిరిగి ఇస్తాడు' అని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన భాగ్యలక్ష్మి 2023 జనవరిలో పలు దఫాలుగా ఆన్‌లైన్‌లో రూ.3.50 లక్షలు చెల్లించింది. రెండేళ్లు గడిచినప్పటికీ ఉద్యోగం పెట్టివ్వకపోగా ముఖం చాటేయడంతో భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. దీంతో నరేందర్, బాబురావుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

సారూ.. 600 మంది రైతుల గోస అర్థం చేసుకోండి..

పోలీస్ అధికారి కాళ్లు పట్టుకుని వేడుకున్న మహిళా రైతు

- మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నారాయణపురం రైతుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న నారాయణపురం గ్రామ రైతులు

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి 600 మంది రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. రైతులు లకుపతి, బాషా, జాన్ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, ఓ మహిళా రైతు పోలీస్ అధికారి కాళ్లపై పడి తమకు సహకరించాలని, 600మంది రైతుల గోస అర్థం చేసుకోవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలో 60 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాలను 2017లో అప్పటి ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా అటవీ భూములని పేర్కొని పట్టాలు రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 94 జారీ చేసి రైతు పేరు, తండ్రి పేరున ఉన్న అడవి అనే పదం తొలగించిందన్నారు. గ్రామంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఆరు నెలలు పూర్తయినా పట్టాలు జారీ చేయలేన్నారు. దీంతో పాస్ పుస్తకాలు లేకపోవడంతో దాదాపు 600 మంది రైతులకు పంట రుణాలు, రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా, ఇతరత్రా పథకాలు అందడం లేదన్నారు. వెంటనే సర్వే ప్రకారం పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారికి వినతి పత్రం అందజేశారు. డీఎస్పీ తిరుపతి రావు ఆధ్వర్యంలో సీఐలు మహేందర్ రెడ్డి, సర్వయ్య బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ధారవత్ రవి, నాయకులు, రైతులు శ్రీనివాస్, శంకర్, వెంకట్‌రెడ్డి, వీరన్న, సురేశ్, కిషన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారి కాళ్లు పట్టుకుని తమకు సహకరించాలని కోరుతున్న మహిళా రైతు

బ్రాహ్మణీయ, హిందూ ఫాసిస్ట్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిరావు



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి రావు

వరంగల్ చౌరస్తా : బ్రాహ్మణీయ, హిందూ ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాసంఘాలు పోరాడాలని, ఇందుకు సమయం ఆసన్నమైందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిరావు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా పనిచేస్తోందని విమర్శించారు. బడా కార్పొరేట్‌లు అంబానీ, అదానీలకు ప్రధాని మోదీ సీఈఓ పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. మధ్య భారతంలో మావోయిస్టులు, ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ దీనికి నిదర్శనమన్నారు. అనంతరం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం శత్రువు దేశంగా ప్రకటించిన పాకిస్తాన్, ఈశాన్య రాష్ట్రాల్లో సాయుధ ఉద్యమాలు చేస్తున్న సంస్థలతో చర్చలు జరిపిందన్నారు. కానీ మావోయిస్టులతో మాత్రం చర్చలు ఉండవని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా మధ్య భారతంలో హత్యాకాండను ఆపి మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మండల వెంకన్న, కె.గోవర్ధన్, ఆవునూరి మధు, గౌని ఐలయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ముక్తి, సత్యం, రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సదస్సుకు ఆ పార్టీ నాయకులు వారం క్రితం పోలీసు అధికారుల అనుమతి కోరగా వారు నిరాకరించారు. అయితే మరోసారి పార్టీ నాయకులు విజ్ఞప్తి మేరకు అనుమతి ఇవ్వగా సదస్సు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు జరిగింది.

అధిక కరెంట్ బిల్లు తెచ్చిన విషాదం..

- బిల్లుపై అధికారిని అడిగొస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం
- వృద్ధురాలి దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు



ఐలమ్మ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఇంటికి అధిక కరెంట్ బిల్లు రాగా ఎందుకొచ్చిందని తెలుసుకునేందుకు వెళ్లిన సందర్భంలో ఓ వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కంచర్లగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవిరబోయిన ఐలమ్మ (69) ఇంటికి కరెంట్ బిల్లు అధికంగా (రూ.28 వేలు) వచ్చింది. దీంతో ఐలమ్మ, తన కుమారుడు నాగేశ్ ఆ విషయం తెలుసుకునేందుకు ఆటోలో ఉదయం కురవి మండల కేంద్రానికి వెళ్లి విద్యుత్ శాఖ అధికారితో మాట్లాడారు. అనంతరం తిరుగు ప్రయాణంలో నరేశ్.. తన తల్లి ఐలమ్మను ఆటోలో తీసుకొచ్చి మానుకోటలోని కురవి గేట్ ప్రాంతంలో వదిలిపెట్టాడు. తన ఆటో సీరియల్ ఆలస్యమవుతుందని పోలంపల్లి తండాకు చెందిన బాలు ఆటోలో తల్లిని ఇంటికి పంపించగా ఇదే ఆటోలో మరో ప్రయాణికుడు కూడా వెళ్లాడు. ఆటో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి సాలార్ తండా దాటి రాజోలు వైపునకు వెళ్తుండగా ఎదురుగా కురవి నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐలమ్మ ఆటో నుంచి కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా ద్విచక్రవాహనంపై ఉన్న మానుకోట పట్టణానికి చెందిన పుచ్చకాయల తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఐలమ్మ, తరుణ్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తరుణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు. కురవి ఎస్సై సతీశ్ ఘటనాస్థలిని సందర్శించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు సరుకులు కొనడానికి వస్తూ.. మృత్యుఒడికి

- డీసీఎం, బైక్ ఢీ.. అక్కడికక్కడే ఇద్దరు యువకుల దుర్మరణం
- కర్ణాలకుంట వద్ద ఘటన



హకీం పాషా(ఫైల్)



కుమారస్వామి(ఫైల్)

చిట్యాల : మొహర్రం పండుగకు సరుకులు కొనడానికి వస్తున్న ఇద్దరు యువకులు మృత్యుఒడికి చేరారు. డీసీఎం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం బుధవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఏలేటిరామయ్యపల్లి గ్రామ శివారు కర్ణాలకుంట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన ఎండి.హకీం పాషా(20), కైలాపూర్‌కు చెందిన సకినాల కుమారస్వామి (21) పని నిమిత్తం బైక్‌పై నవాబుపేట నుంచి చిట్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో చిట్యాల నుంచి నవాబుపేట వైపునకు వెళ్తున్న డీసీఎం కర్ణాలకుంట వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎండి. హకీం పాషా, కుమారస్వామి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కాగా, కుమారస్వామి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఎండి.హకీం పాషా గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నవాబుపేటలో ప్రతీ సంవత్సరం జరిగే మొహర్రం వేడుకలకు కుమారస్వామి హాజరయ్యేవాడు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తన స్వగ్రామం కైలాపూర్ వచ్చాడు. ఈ క్రమంలో కుమారస్వామి నవాబుపేటకు వెళ్లాడు. అనంతరం ఇద్దరు కలిసి మొహర్రం పండుగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై చిట్యాలకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని బోరున విలపించారు. ఇద్దరి మృతదేహాల మీద పడి గుండెలవిసేలా రోదించారు. ఈ విషయం తెలుసుకున్న చిట్యాల ఎస్సై -2 ఈశ్వరయ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- రూ.8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం

గార్ల : తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. రూ.8 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం గార్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గార్లకు చెందిన మూడు నిఖిల్, బేతి అరవింద్ వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గత మార్చి 23 నుంచి మే 10వ తేదీల మధ్య తాళం వేసి ఉన్న పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అలాగే, ఇటీవల గార్లలోని కొలిమికొట్టం బజారులో తాళం వేసి ఉన్న బాదావత్ కేస్లీ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.2,15,000 విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.3,600 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. కాగా, నిందితుడు నిఖిల్‌ను విచారణ నిమిత్తం పీఎస్‌కు తీసుకురాగా, పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో పోలీసులు మరోసారి తీసుకురాగా పురుగుల మందు తాగానని, మీపేరు రాసి చనిపోతానని బెదిరించడంతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు నిఖిల్‌పై మరో 2 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గార్లబయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై రియాజ్‌పాషా, సిబ్బంది తిరుమలరావు, సుధాకర్, శ్రీను, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందవేమోనని...

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

- హెచ్ఎంగా 9నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన సోమిరెడ్డి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన



సోమిరెడ్డి (ఫైల్)

నెల్లికుదురు: ఆయనో ప్రధానోపాధ్యాయుడు. ఉద్యోగ విరమణ పొంది 9 నెలలైంది. ఇంకా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదు. దీంతో మనోవేదనకు గురై అనారోగ్యం బారిన పడి చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన కొండేటి సోమిరెడ్డి (63) హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 30న విరమణ పొందాడు. నాలుగు నెలలలోపు ప్రభుత్వంనుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సుమారు రూ.56 లక్షలు 9నెలలైనా అందలేదు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పొందేవారు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8వేల మంది ఉన్నారని, వారిలో నీకు అందే వరకు ఎన్నేళ్లు పడుతుందోనని స్థానికులు రకరకాలుగా మాట్లాడారు. దీంతో తనకు ఆ డబ్బులు వస్తాయో..రావోనని, కూతురుకు, ఇతరులకు సెటిల్‌మెంట్లు చేయాల్సి ఉందని మదనపడుతుండేవాడు. ఇలా మనోవేదనకు గురైన సోమిరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమిరెడ్డి మంగళవారం రాత్రి చనిపోయాడు. ఉద్యోగ విరమణ పొందిన నాలుగు నెలలలోపే అందించాల్సిన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అందలేదని, సమయానికి బెనిఫిట్స్ ప్రభుత్వం అందిస్తే తమ నాన్న బతికేవాడని మృతుడి కుమారుడు కొండేటి కిశోర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సునీత, ఒక కొడుకు కిశోర్‌రెడ్డి, కూతురు ఉన్నారు.

మోడల్ షాదీఖానాగా తీర్చిదిద్దుతాం

- ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్



షాదీఖాన వద్ద అధికారులు, నాయకులతో ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్

న్యూశాయంపేట : వరంగల్ ఎల్‌బీనగర్‌లోని షాదీఖానాను రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాను బుధవారం పరిశీలించారు. నిర్మాణం ఆలస్యంపై అధికారులను ఆరాతీశారు. ఇప్పటివరకు కేటాయించిన నిధులను ఏ మేరకు ఖర్చు చేశారో 'కుడా' ఏఈని వివరాలు అడిగారు. షాదీఖాన నిర్మాణం కోసం 'కుడా' రూ.3కోట్ల 50 లక్షల అంచనాతో పనులు చేపట్టామని, ఇప్పటివరకు గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి, రెండో అంతస్తులు స్లాబ్ వరకు పనులు పూర్తి అయినట్లు ఏఈ భరత్ వివరించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తికావాలంటే ఏమేరకు నిధులు అవసరమవుతాయో అంచనా వేసి తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ సహకారంతో అద్భుత షాదీఖాన నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఏడీ వి.కృష్ణ, కార్పొరేటర్లు సురేశ్ జోషి, మహ్మద్ ఫుర్ఖాన్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టి.రమేశ్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సూపరింటెండెంట్ విజయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్, చాంద్‌పాషా, ఆజం, యాకూబ్‌పాషా, సిరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎంఏ తెలుగులో ప్రవేశాలకు గడువు పెంపు

హన్మకొండ కల్చరల్: వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025–26 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశానికి గడువు ఈనెల 24తో ముగిసింది. రూ.100 ఆలస్య రుసుముతో జూన్ 30 వరకు ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని.. ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 99894 17299, 99891 39136 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సోమిడిలో చోరీ

- రూ.2.50 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చొరబడి తులం బంగారం, 49 తులాల వెండి నగలు, రూ.లక్ష నగదును అపహరించుకెళ్లారు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. మేకల రమ తన ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఈక్రమంలో బంగారు, వెండి నగలతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

